# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : మేనేజింగ్ ఎడిటర్ :

జె. సి. ఛోట్ జాషువా గూటం

సంచిక **12** జూలై **1986** సంపుటి **6**


## సంపాదకీయము

### క్షమాపణ వలన కలుగు ఆశీర్వాదములు

***(The Blessings of Forgiveness)***

క్షమాపణ పొందగలిగే లోకంలో మనం జీవించుచున్నందున నిజంగా మనము దీవించబడినవారము. ఈ లోక పాపములకొరకు క్రీస్తు సిలువమీద చనిపోయినందువలన అది సాధ్యమాయెను (రోమా 5:8). ఆయన రక్తము చిందించినందున అందరు రక్షింపబడుదురని కాదు గాని ఆయన వలన అందరు రక్షింపబడే తరుణమున్నదని దాని యర్థము. అంతేకాదు, ఆయనయందు విశ్వాసముంచి ఆయనకు విధేయులగు వారందరు రక్షింపబడుదురు (మార్కు 16:15, 16).

క్షమాపణనుగూర్చి, విమోచననుగూర్చి లేదా అట్టి భావములనుగూర్చి వ్యక్తపర్చు కొన్ని లేఖనాలను ఇప్పుడు చూద్దాం:

1. క్షమాపణ: "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది" (ఎఫెసీ 1:7). కొలస్స 1:14 కూడ చదువుము.

2. పాపక్షమాపణ: "ఇది నా రక్తము, పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:28). "పేతురు-మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

3. రక్షింపబడుట: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేమనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21).

4. రక్షణ: "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:12). "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడనుకాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (గోమా 1:16). "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10). "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము...ఈ లోకములో స్వస్థ బుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెనని బోధించుచున్నది" (తీతు 2 : 11 - 13).

5. నీ పాపములు కడుగుకొనుము : "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అపొ.కా. 22:16).

6. విడుదల : "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:13, 14). "దేవుడు మృతులలోనుండి లేపిన యేసు, అనగా రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు..." (1 థెస్స 1:10).

7. స్వాతంత్ర్యము : "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:32). "ఏలయనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము. చనిపోయినవాడు పాప విముక్తుడని తీర్పు పొందియున్నాడు" (రోమా 6:6-8).

8. శుద్ధిపరచబడుట : "హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). "మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి, యొకనినొకడు హృదయపూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:22,23).

9. విమోచనము : "అయితే క్రీస్తు రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి హస్తకృతము కానిది, అనగా ఈ సృష్టి సంబంధము కాని దియు, మరి ఘనమైనదియు, పరిపూర్ణమైనదియునైన గుడారము ద్వారా, మేకలయొక్కయు, కోడెలయొక్కయు రక్తముతో కాక, తన

స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:11, 12). "అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తు యేసుద్వారా అన్యజనులకు కలుగుటకై క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మ శాస్త్రము యొక్క శాపమునుండి విమోచించెను" (గలతీ 3:13, 14).

10. పాపములు తుడిచివేయబడుట : "ప్రభువు సముఖమునుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లును, మీ కొరకు నియమించిన క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సునొంది తిరుగుడి" (అపొ.కా. 3:19, 20).

11. పాపములు కప్పబడుట : "ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటె ముఖ్యముగా ఒకనియెడల ఒకడు మిక్కుటమైన ప్రేమగలవారై యుండుడి" (1 పేతురు 4:8; యాకో 5:20).

12. పాపమునుండి పవిత్రపరచబడుట : "అయితే ఆయన వెలుగులో నున్నప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహా 1:7).

13. తిరిగి జన్మించుట : "అందుకు యేసు అతనితో - ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని" చెప్పెను (యోహాను 3:3). "యేసు ఇట్లనెను - ఒకడు నీటి మూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని చెప్పెను" (యోహాను 3:5). "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతనసృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17).

మనము క్రీస్తునందు విశ్వసించి ఆయన ఆజ్ఞలకు లోబడునప్పుడు మనకు లభించు రక్షణ, క్షమాపణ, పాపవిమోచననుగూర్చి ఈ లేఖనములు, మరి అనేక లేఖనములు తెలియజేయుచున్నవి. ఆయన మన

నుండి కోరుదానికంటే ఆయన మనకిచ్చునది ఎంతో గొప్పది. మనమేమి చేసినా, మన రక్షణకు తగు మూల్యము మాత్రం ఇయ్యలేము. మనము విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడుదుము (ఎఫెసీ 2:8, 9). అయితే ఆయన కోరిక చొప్పున చేయకుండా రక్షింపబడజాలము.

మనమాయన సన్నిధిలో తగ్గించుకొని ఆయనకు విధేయులమైనప్పుడు ప్రభువు మన గత పాపములన్నిటిని క్షమించునని తెలిసికొనుట ఆశీర్వాదకరము. అంతేకాదు ఆయనకొరకు జీవిస్తూ నమ్మకముగా ఉండినయెడల ఆయన రక్తము మనలను పాపమునుండి పవిత్రులుగా చేయుచు యుండును (1 యోహాను 1:7). అప్పుడు చివరిగా మనకు జీవకిరీటము లభించును (ప్రక 2:10). అక్కడ ప్రభువుతో మనం నిత్యం జీవించుదుము.

---

## "రాజ్యమును మొదట వెదకుడి"

## *(Seek Ye first the Kingdom of God)*

—ప్రభుదాస్ సబ్బతి, ఔరంగాబాద్.

"మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33). ఈ లేఖనాన్ని పఠించినట్లయితే మనము రెండు విషయాల్ని గ్రహించగలము. మొదటిది—రాజ్యమును వెదకుట; రెండవది—నీతిని వెదకుట. రాజ్యాన్ని వెదకాలంటే ఆ రాజ్యపు ఉనికిని దాని స్వభావాన్ని తెలుసుకోవాలి.

నేటి కొన్ని క్రైస్తవశాఖలు రాజ్యాన్నిగూర్చి భిన్నమైన వింతైన బోధలు ప్రచారం చేస్తున్నాయి: "క్రీస్తు మొదటిసారి ఈ లోకానికి వచ్చినపుడు రాజ్యము స్థాపించాలనే సంకల్పముతోనే వచ్చాడు. గాని పరిస్థితులు అనుకూలించక, అంటే యూదులు క్రీస్తును తృణీకరించుటవలన, రాజ్యానికి బదులు సంఘాన్ని స్థాపించాడు; రెండవ

రాకడలో యెరూషలేమును కేంద్రముగా చేసికొని, తన రాజ్యాన్ని వెయ్యేండ్లు పాలిస్తాడు" అని బోధిస్తున్నారు. ఈ బోధ ఎంత మట్టుకు సత్యం? బైబిలు ప్రకారమైనదా? రాజ్యాన్నిగూర్చి బైబిలు ఏమని బోధిస్తున్నది? రాజ్యాన్ని గూర్చిన యిత్యాది ప్రశ్నలకు జవాబులను లేఖనములనుండి నేర్చుకొందము.

## ఇశ్రాయేలీయులు - రాజ్యపాలన

ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమునుండి కనాను చేరిన తరువాత యించుమించు 400 సం॥లు న్యాయాధిపతులవలన పాలింపబడ్డారు. ప్రవక్తయు, న్యాయాధిపతియునైన సమూయేలు కాలములో— "సకల జనుల మర్యాద చొప్పున మాకు రాజును నియమించుము" (1 సమూ॥ 8:5) అని ఇశ్రాయేలీయులు అడిగినప్పుడు, యెహోవా దానికి అంగీకరించి, రాజరికము వలనైన కష్ట నష్టములను వివరించి (1 సమూ॥ 8:5-22) సౌలును రాజుగా యిచ్చాడు. నిజానికి అట్టి ఏర్పాటును, వీలును దేవుడు తన శాసనములో ముందుగనే నిర్ణయించాడు: "నా చుట్టునున్న సమస్త జనులవలె నా మీద రాజును నియమించుకొందు ననుకొనిన యెడల దేవుడైన యెహోవా ఏర్పరచువానిని అవశ్యముగా నీ మీద రాజుగా నియమించుకొనవలెను. నీ సహోదరులలోనే ఒకని నీ మీద రాజుగా నియమించుకొనవలెను. నీ సహోదరుడుకాని అన్యుని నీ మీద నియమించుకొనకూడదు..." పిమ్మట రాజుకు తగని నాలుగు నిషేధములు, నెరవేర్చవలసిన నాలుగు విధులు ఈయబడినవి (ద్వితీ 17:14-22).

సమూయేలు ప్రవక్త దేవుని చిత్తప్రకారము బెన్యామీను గోత్రికుడైన సౌలును రాజుగా అభిషేకించి (1 సమూ॥ 9:16, 10:22-24) రాజ్యపాలన పద్ధతిని జనులకు వినిపించి, ఒక గ్రంథమును వ్రాసి యెహోవా సన్నిధిని దానినుంచెను (1 సమూ॥ 10:25). ఇంచుమించు

క్రీ॥ పూ॥ 1095 సం॥ నుండి ఇశ్రాయేలీయులకు రాజరిక వ్యవస్థ యేర్పడినది.

దేవునికి విరోధముగా సౌలురాజు పాపము చేయుటవలన, రాజరికము యూదా గోత్రికుడైన దావీదుకు అనుగ్రహింపబడినది. ఇశ్రాయేలీయులను సౌలు 40 సం॥లు, దావీదు 40 సం॥లు, సొలొమోను 40 సం॥లు పాలించిన పిమ్మట, సొలొమోను కుమారుడైన రెహబాము పాలనలో ఇశ్రాయేలు దేశము (ఐక్యరాజ్యము) రెండు భాగములైంది. ఉత్తర ప్రాంతమైన ఇశ్రాయేలు రాజ్యము షోమ్రోను కేంద్రముగా యరోబాము రాజుగా పాలన ఆరంభించి, 19 మంది రాజులచే ఏలబడి ప్రజల యొక్కయు రాజుల యొక్కయు పాపములవలన, క్రీ॥పూ॥ 721 సంవత్సరములో అష్షూరీయులచే చెరపట్టబడింది.

దక్షిణ ప్రాంతమైన యూదా రాజ్యము యెరూషలేము కేంద్రముగా 20 మంది రాజులచే పాలింపబడి, ఇశ్రాయేలు రాజ్యపు నాశనమును చూచియు వారివలెనే పాపమునుండి దేవునివైపు మరలనందున క్రీ॥ పూ॥ 606 నుండి 586 వరకు బబులోను వారిచే చెరపట్టబడుచుండెను.

"మీరు (ఇశ్రాయేలీయులు) యొర్దాను దాటి స్వాధీనపరచుకొనబోవు దేశములో ఉండకుండ త్వరలోనే బొత్తిగా నశించిపోదురు" (ద్వితీ 4:25, 26) అని దేవుడు వారిని ముందుగనే హెచ్చరించాడు. ద్వితీయోపదేశ కాండము 4, 8 అధ్యాయములు చదివినట్లయితే దీన్ని గూర్చి విపులముగా తెలిసికొనవచ్చును. దేవుని విసర్జించి విగ్రహములను పూజించుటవలన దేవుడు ఇశ్రాయేలీయులను తమ శత్రువులకు అప్పగించి శిక్షించాడు.

## మెస్సీయ కొరకు ఇశ్రాయేలువారి నిరీక్షణ

"ఇశ్రాయేలువారు యరొబాము చేసిన పాపములలో దేనిని మరువక వాటిని అనుసరించుచు వచ్చిరి గనుక తన సేవకులైన ప్రవక్తల

ద్వారా యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున ఆయన ఇశ్రాయేలు వారిని తన సముఖములోనుండి వెళ్ళగొట్టెను. ఆ హేతువుచేత వారు స్వదేశములో నుండి అష్షూరు దేశములోనికి చెరగొని పోబడిరి. అష్షూరు రాజు బబులోను, కూతా, అవ్వా, హామాతు, సెపర్వయీము అను తన దేశములలో నుండి జనులను రప్పించి ఇశ్రాయేలువారికి మారుగా షోమ్రోను పట్టణములో ఉంచెను. వారు షోమ్రోను దేశమును స్వతంత్రించుకొని దాని పట్టణములలో కాపురము చేసిరి. అయితే వారు కాపురముండ నారంభించినపుడు యెహోవాయందు భయభక్తులు లేని వారు గనుక యెహోవా వారి మధ్యకు సింహములను పంపెను. అవి వారిలో కొందరిని చంపెను. — తమరు పట్టుకొనిన షోమ్రోను పట్టణములో తాముంచిన జనులకు ఆ దేశపు దేవుని మర్యాద తెలియకున్నది గనుక ఆయన సింహములను పంపించెను. ఇశ్రాయేలు దేవుని మర్యాద వారికి తెలియనందున సింహములు వారిని చంపుచున్నవని — వారు రాజుతో మనవి చేయగా, అష్షూరు రాజు—అచ్చటినుండి తేబడిన యాజకులలో ఒకనిని అచ్చటికి మీరు తోడుకొని పోవుడి; అతడు అచ్చటికి పోయి కాపురముండి ఆ దేశపు దేవుని మర్యాదను వారికి నేర్పవలెనని ఆజ్ఞాపించెను. కాగా షోమ్రోను (సమరయ) నుండి వారు పట్టుకొని వచ్చిన యాజకుడు ఒకడు వచ్చి బేతేలు ఊరిలో కాపురముండి, యెహోవాయందు భయభక్తులుగా ఉండతగిన మర్యాదను వారికి బోధించెను" (2 రాజులు 17:22-28).

ఇశ్రాయేలీయులు, అష్షూరీయుల మిశ్రమ సంతానమే—సమరయులు. యోహాను 4వ అధ్యాయములో, క్రీస్తుతో సంభాషించిన సమరయ స్త్రీ ఆయనతో-"క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును. ఆయన వచ్చినపుడు మాకు సమస్తమును తెలియజేయును" (4:25) అని అన్నది. దీన్ని బట్టి విశ్రమ జాతియైన సమరయులు మెస్సీయ కొరకు నిరీక్షిస్తున్నట్లు అర్థమగుచున్నది.

9

# మెస్సీయ కొరకు యూదుల నిరీక్షణ

నెబుకద్నెజరుచే బబులోను చెరలోనికి కొనిపోబడక ముందు యిర్మీయా వారి గతిని గూర్చి యిట్లు ప్రవచించాడు : "యెహోవా ఈ ఆజ్ఞ యిచ్చుచున్నాడు - బబులోను రాజ్యముకు డెబ్బది సంవత్సరములు గతించిన తర్వాతనే మిమ్మును గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి, ఈ స్థలమునకు తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును" (యిర్మీయా 29:10). ఈ ప్రవచన ప్రకారము యూదావారు బబులోను దేశములో 70 సం॥లు జీవించారు (దానియేలు 9:2; 2 దిన 36:26).

యిర్మీయా ప్రవచనము నెరవేరునట్లు పారశీక రాజైన కోరెషు మనస్సును యెహోవా ప్రేరేపింపగా, యెరూషలేములో దేవుని మందిరమును తిరిగి కట్టుటకు అనుమతించాడు (ఎజ్రా 1). క్రీ. పూ. 536 సం॥లో జెరుబ్బాబెలు నాయకత్వమున బయలుదేరి యెరూషలేమునకు తిరిగి వచ్చిన యూదులు 20 సం॥లలో యెరూషలేము దేవాలయమును నిర్మించారు (ఎజ్రా 3-6). క్రీ. పూ. 457 సం॥లో ఎజ్రా నాయకత్వమున మరికొందరు యూదులు యెరూషలేము చేరుకొన్నారు. శాస్త్రియైన యితడు ధర్మశాస్త్రమును పరిశోధించి దేవాలయమందలి యాజక ధర్మమును విధులను పునరుద్ధరించాడు (ఎజ్రా 7-10). పిమ్మట క్రీ.పూ. 444 సం॥లో నెహెమ్యా బబులోను నుండి వెళ్ళి ప్రాకారములను తిరిగి కట్టించాడు.

అప్పటి నుండి యూదులు తమ దేవుని ఆరాధించుకొనుటకు యెరూషలేములో దేవాలయమును కల్గియుండిరి. "యెరూషలేమునందు సుమెయోనను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును భక్తిపరుడునై యుండి, ఇశ్రాయేలు యొక్క ఆదరణ కొరకు కని పెట్టువాడు..." (లూకా 2:25). "యెరూలేవేములో విమోచన

కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాటలాడుచుండెను" (లూకా 2:38). "ప్రజలు కనిపెట్టుచు, ఇతడు క్రీస్తయి ఉండునేమో అని అందరును యోహాను గూర్చి తమ హృదయములలో ఆలోచించుకొనుచుండిరి" (లూకా 3:15).

ఈ వాక్యములను బట్టి యూదులు కూడ మెస్సీయ కొరకు నిరీక్షిస్తున్నట్లు తెలియుచున్నది. యూదుల పై చరిత్ర నుండి మనము గమనించవలసిన విషయాలు ఏమిటంటే: (1) సౌలు రాజుచే క్రీ.పూ. 1095 నుండి ఆరంభమైన రాజరిక పాలన క్రీ.పూ. 586 లో అంతమైంది. (2) క్రీ.పూ. 586 నుండి యూదా రాజ్య సింహాసనముపై రాజు లేక పోవుట. (3) యూదులు యెరూషలేమునకు తిరిగి వచ్చి దేవాలయమును, ప్రాకారమును తిరిగి నిర్మించుకొని మతపరమైన స్వేచ్ఛను కల్గియుండిరి గాని రాజకీయముగా పునరుద్ధరింపబడలేదు. లౌకిక యూదా రాజ్యపాలన యెన్నడును తిరిగి స్థాపింపబడలేదు. (4) ప్రస్తుత ప్రపంచములో యూదులు అనే వారున్నా, వారు ఏయే గోత్రములకు చెందినవారో వారికే తెలియదు. (5) గనుక యూదులకు లౌకిక రాజ్యము స్థాపింపబడి యూదా గోత్రికుడు రాజై ఏలుట అసంభవము.

(సశేషము)

---

## యెంచుకొనుట

మానవుని దైనందిన జీవితంలో యెంచుకొనుట చాల ప్రాముఖ్యమైనది. ఉదయం లేచినదగ్గరనుండి రాత్రి పడుకునే సమయం వరకు మనం కొనే వస్తువులు ఏవి మంచివో, ఏవి శ్రేష్ఠమైనవో, ఏవి నాణ్యమైనవో పరిశోధించి, పరీక్షించి, చివరికి మంచిగా ఉన్నవని మనస్సులో తోచినదానిని యెంచుకొని సంతృప్తి చెందుతూ వుంటాం.

ఇహలోకమునకు సంబంధించిన వాటికే మనం ఇంత ప్రాముఖ్యత నిచ్చు చున్న యెడల పరలోక సంబంధమైన వాటి విషయమై ఇంకా ఎంత గౌరవప్రతిష్ఠలు ఇవ్వాలో నిర్ణయించుకోవలసిన బాధ్యత ప్రతీ మానవునిపై ఉన్నది.

మనము ఈ లోకములో పరదేశులము, యాత్రికులునై యున్నామను సంగతి మరచిపోరాదు. రోమా గవర్నర్ అయిన పిలాతు, నేను ఎవనిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు? 'బరబ్బా' అనే బందిపోటు దొంగనా? లేక యేసునా? అని యూదుల నడిగి నప్పుడు 'బరబ్బా' నే అని సమాధానమిచ్చేరు. యేసు నీతిమంతుడు, సత్యస్వరూపి, ఆశ్చర్యకరుడు. అలాంటివానిని విడిచిపెట్టి, బందిపోటు దొంగ అయిన 'బరబ్బా'ను విడిపించమని యెంచుకొనుట యుక్తమేనా?" సరిఅయినదానిని యెంచుకొనుటద్వారా మేలు జరుగును. ఉత్తమమైనదానిని నిర్ణయించుకొనుటద్వారా సంతోషభరితులగుదుము.

యెహోషువ "మీ రెవరిని సేవింపకోరుకొనినను, నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము" అని చెప్పెను. విశ్వాసమును బట్టి మోషే ఐగుప్తుధనముకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము, పాపభోగం అనుభవించుట కంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించెను. కనుక మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడుగా పేరు గాంచెను. "సత్యమార్గమును నేను కోరుకుని యున్నాను" అని దావీదు చెప్పు చున్నాడు. అలాగే సొలోమోనుకు దేవుడైన యెహోవా నేను నీకు దేనినిచ్చుట నీకిష్టమో అడుగుమని అతనితో చెప్పగా అతడు వివేకము గల హృదయమును కోరుకొనెను. సొలోమోను ఉత్తమమైన దానిని యెంచుకొనినందున దేవుడు మెచ్చుకుని, జ్ఞానమును, బుద్ధిని, వర్ణింప శక్యంగాని వివేచనకల మనసును అతనికి ఇచ్చియున్నాడు. యోబు శోధింపబడినప్పుడు అతని భార్య, నీవు ఇంకను యదార్థతను వదలక

యుండువా ? దేవుని దూషించి మరణము కమ్మనెను. కాని యోబు ఆ మార్గమును యెంచుకొనక శోధన జయించి ధన్యుడయ్యెను. అంతియే కాకుండా నీతిమంతుడని యెంచబడెను. పూర్వం కలిగినదాని కంటే అధికముగా దేవుడతనికి దయచేసెను. లోతు విషయమై పరిశీలించిన అతడు యెంచుకొనిన ప్రదేశంలోని ప్రజలు దుష్టులును యెహోవా దృష్టికి పాపులునై యుండిరి. 'మార్త' మరియు విషయం చూచినట్టయితే, "మరియ యేసు పాదములయొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను. మార్త విస్తారమైన పని పెట్టుకొనుట చేత తొందర పడి, ఆయన యొద్దకు వచ్చి - ప్రభువా, నేను ఒంటరిగా పని చేయుటకు నా సహోదరి నన్ను విడిచిపెట్టినందున, నీకు చింతలేదా ? నాకు సహాయం చేయుమని ఆమెతో చెప్పుమనెను. అందుకు ప్రభువు - మార్తా, మార్తా, నీ వనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు. గాని అవసరమైనది ఒక్కటే! మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను" (లూకా 10:38-42).

కనుక మనం సరియైనదానిని, యుక్తమైనదానిని యెంచుకొనుట ద్వారా మేలు పొందెదం.

## సత్యాన్ని ఎంచుకోవాలి

ఈనాడు అనేకమంది బైబిలు బోధించు సంఘంలో వుండకుండా మానవకల్పితమైన మతశాఖలను యెంచుకొనియున్నారు. వాటిలో రక్షణలేదు. వారు చేసేదంతా వ్యర్థారాధన. అవన్నీ మనుష్యులు కల్పించినవే. 'నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును' (మత్తయి 15:13) అని యేసు చెప్పియున్నాడు. అంతేకాదు "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారం చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21) అని కూడ ఆయన బోధిం

చారు. క్రీస్తు ఒకే సంఘమును స్థాపించియున్నాడు. యేసు తన సంఘమును కట్టుదునని చెప్పాడు: "నేను నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:18). ఆయన ఒకే సంఘమును కట్టినట్లు లేఖనములు ప్రకటించుచున్నవి. 'ఒకే శరీరం' (ఎఫెసీ 4:4). 'ఆయన సంఘము అను శరీరమునకు శిరస్సు' (కొలస్స 1:18). క్రీస్తు సంఘము యెరూషలేములో క్రీస్తుశకము 33వ సంవత్సరమున ప్రారంభమయ్యెనట్టు దైవ ప్రవచనం, దైవావేశ చరిత్ర చెప్పుచున్నది. దీని స్థాపకుడు క్రీస్తు. అంతియే కాకుండా దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘం క్రీస్తు సంఘం.

కావున ప్రియ చదువరీ, నీవు ఇంకను మానవ మతశాఖలలో మూలుగుచున్నావా! నేడే సరిఅయిన సంఘాన్ని ఎంచుకో. అదియే క్రీస్తు సంఘం. —ఇసుకపట్ల ఇశ్రాయెల్, కాకినాడ-4.

---

## అబ్రాహాము కుమారులు

గొప్ప జలప్రళయము నుండి ఎనిమిది మంది మాత్రం రక్షించబడ్డారు. అటుతరువాత ఉద్భవించిన జనాంగములన్నీ నోవహు సంతతి వారే. అతని ముగ్గురు కుమారులగు షేము, హాము, యాపెతను వారివలన భూమి విస్తరించబడింది. నోవహు కురులద్వారా ఈ భూమి అంతా ఎలా విస్తరించబడెనో ఆదికాండము 11 వ అధ్యాయములో వ్రాయబడియున్నది. అబ్రాహాము షేము సంతతివాడు. కొంత కాలానికి ప్రజలు దేవుని నుండి దూరమైపోయారు. అబ్రాహాము తండ్రియైన తెరహు యితర దేవతలను పూజించేవాడని వ్రాయబడియున్నది (యెహోషు 24:2). ఆదికాండము 12 వ అధ్యాయము నుండి అబ్రాహాము, అతని జీవితము గూర్చి మనము కనుగొనగలము.

హెబ్రీ పత్రిక లేఖకుడు అబ్రాహామును గూర్చి వ్రాస్తూ, "అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు

(యాకోబు 2:23). వాగ్దానము చేయబడినట్లు అతడనేక జనాంగము లకు తండ్రి అయ్యాడు.

క్రొత్త నిబంధనలో సంతానహీనుడైన మరియొక వృద్ధుని కనుగొనగలము. అతడు యాజకుడైన జెకర్యా. అతని భార్య ఎలీసబెతు. "వీరిద్దరు ప్రభువుయొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి" (లూకా 1:6). ఈ దంపతులు ప్రభువు యొక్క ధర్మశాస్త్రమునుబట్టి నడుచుకొనుచు నీతిమంతులై యున్నట్లు మనము గమనించగలము; జెకర్యా దేవుని మందిరములో సేవచేయు చున్న ఒక యాజకుడు. అతడు యూదులకు బోధిస్తూ వారిని నడిపించు చున్నాడు. ఒకనాడు ప్రభువు దూతగు గబ్రియేలు అతనికి కనబడి, "జెకర్యా భయపడకుము; నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహాననని పేరు పెట్టుదువు. అతడు ప్రభువు దృష్టికి గొప్పవాడై...పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఇశ్రాయేలీయులలో అనేకులను ప్రభువైన వారి దేవుని వైపునకు త్రిప్పును" అని చెప్పెను (లూకా 1:13-17). ప్రభువు దూత పుట్టబోవు శిశువును గూర్చిన సంపూర్ణ వివరణ, అతని పేరు, జీవితము, చేసేపని మొదలగువాటిని గూర్చి చెప్పాడు. గాని అతడు ప్రభువుదూత మాట నమ్మలేదు. అందువలన "ఈ సంగతులు జరుగు దినము వరకు నీవు మాటలాడక మౌనివై యుందువని" దూత అతనితో చెప్పాడు (లూకా 1:20).

అబ్రాహాము, జెకర్యా అనువారిలో కొన్ని సమానాంత రాలు, తారతమ్యాలు మనం చూడగలము. ఇద్దరు సంతానములేని వృద్ధులే, దేవుని దృష్టిలో నీతిమంతులనబడినవారే. మరియు తమ వృద్ధాప్యములో కుమారులు కలుగుదురని వాగ్దానము చేయ బడినవారే.

అబ్రాహాము తండ్రి యితర దేవతలను సేవించేవాడు. జెకర్యా ఒక యాజకుడు, గనుక లేవీయుడు. అంటే అతని పితరులు యాజకులు. కానానులో తన చుట్టుయున్న ప్రజలు విగ్రహారాధకులై యుండగా అబ్రాహాము ఒక్కడే నిజదేవుని సేవించుచుండెను. జెకర్యా దేవుని ఆలయములోనే నివసించుచు ప్రభువుచే ఏర్పరచుకొనబడిన ప్రజలకు పరిచర్య చేయుచుండెను. ధర్మశాస్త్రము చొప్పున నడుచుకొని నీతి మంతుడవుటకు అబ్రాహాము కాలములో ధర్మశాస్త్రమీయబడలేదు. జెకర్యా అయితే ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పున విధుల చొప్పున నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతుడై యుండెను (లూకా 1:6). అబ్రాహాముకు వృద్ధాప్యములో కుమారుడు కలుగునని ప్రభువు వాగ్దానము చేయగా అతడు నమ్మెను (ఆది 15:5, 6). జెకర్యాకు వాగ్దానము చేయబడినప్పుడతడు దేవుని దూతను నమ్మలేదు (లూకా 1:20).

ఈ యిద్దరిలోను మనమెవని పోలియున్నాము? అబ్రాహాము నివసించిన కాలములో మనములేము, మోషే యుగములో కూడ లేము. మనము క్రైస్తవ యుగములో, మన ప్రభువైన యేసు క్రీస్తు కృపకాలములో జీవించుచున్నాము. "కాబట్టి విశ్వాససంబంధులే అబ్రాహాము కుమారులని మీరు తెలిసికొనుడి" యని పౌలు వ్రాయు చున్నాడు (గలతీ 3:7). మనము రక్తమాంసములనుబట్టిగాక విశ్వాస మునుబట్టి అబ్రాహాము కుమారులము. ఇశ్రాయేలీయులు, ఇష్మా యేలీయులు ఏశావుసంతతి, అబ్రాహాముకు కెతూరద్వార కలిగిన సంతతి (ఆది 25:1-5) మొదలైనవారు అబ్రాహాముద్వారా కలిగిన వారే. అయితే కృపయుగంలో విశ్వాసమునుబట్టి అబ్రాహాము కుమారులైనవారే రక్షింపబడుదురు. విశ్వాసము లేకుండ మనము అబ్రాహాము కుమారులముకాము. మనము పైకి క్రైస్తవులవలె కన్పడవచ్చు, ఆరాధనలకు వెళ్లుచు యుండవచ్చు గాని జెకర్యావలె

ఆయన వాగ్దానములను విశ్వసించలేకపోతే, మనకు శిక్ష తప్పదు. గనుక మనము అబ్రాహాము రొమ్మున ఆనుకొనగల్గునట్లు విశ్వాసము ద్వారా అతనికి నిజమైన కుమారులముగాను కుమార్తెలుగాను యుందము (లూకా 16:23).

— కవిత కూటం

---

నేనేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని-12

## రక్షింపబడుటకు నేనేమి చేయవలెనను ప్రశ్నకు అది లేఖనార్ధమైన జవాబిచ్చుచున్నది

### I ఈ ప్రశ్నకు జవాబిచ్చే నిశ్చయ మార్గము

1. బైబిలును తెరచి ఈ ప్రశ్నను దానికియ్యబడిన జవాబును చదివి తెలిసికొనుటకంటె విపులము, జ్ఞానయుక్తము నిశ్చయమైన విధానము మరొకటి యుండదు. ఈ ప్రశ్న ఒక వందసార్లు కనబడితే ఆ వంద సందర్భములలోను ఇయ్యబడిన జవాబును చదువుము. నిస్సందేహముగా యిది లేఖనార్ధమైనది, సరియైనది. అంతేగాక, ఈ యంశముపై అది సత్యాన్నంతటినీ అందించును. కాని ఈ ప్రశ్న వందసార్లు లేదు. క్రొత్త నిబంధనలో దానిని మనం నాలుగుసార్లు అందులోను ఒకసారి మోషే ధర్మశాస్త్రం అమలులోయున్న కాలంలో కనుగొంటాము.

2. యేసునొద్దకు వచ్చిన ధనవంతుడైన యౌవనస్థుడు మొట్ట మొదట ఈ ప్రశ్న వేసాడు (మార్కు 10:17). యేసు అతనికి పది యాజ్ఞలను గూర్చి చెప్పాడు. అప్పటికి మోషే ధర్మశాస్త్రము అమలులో నున్నది, ఏలయనగా క్రీస్తు ఇంకా సిలువపై మేకులతో కొట్టబడి చనిపోలేదు (కొల 2:14). దాన్ని గైకొనడం యూదునియొక్క

విధి. బాల్యమునుండి దానిని గైకొనుచున్నానని ఆ యౌవనస్థుడు జవాబిచ్చినప్పుడు యేసు అతని చూచి "నీకు ఒకటి కొదువగానున్నది; నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను" (మార్కు 10:21). మోషే ధర్మశాస్త్ర మింకను రద్దుపరచబడ లేదు; దాని నతడు గైకొనవలసి యున్నది. మరియు అతనికి అభ్యంతర కారణమైన తన ఆస్థినుండి అతడు స్వతంత్రుడు కావాలి; అంతేకాదు శిష్యులవలె అతడుకూడ క్రీస్తును వెంబడించాలని చెప్పబడింది. మరియు రాబోవు యుగంలో కృషి సల్పడానికి అతడు మంచి శిక్షణ పొందును. ఆ జవాబు ఈనాడు ఇయ్యబడదు; క్రొత్త నిబంధన అమలులోనికి రాక ముందు ఆ జవాబియ్యబడింది (హెబ్రీ 9:16, 17).

ఈ యౌవనస్థుడు "మిగుల ఆస్థిగలవాడు గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్ళిపోయెనని" మనము గమనించుట మంచిది. నేనేమి చేయాలి? అని అడిగినప్పుడతడు నిష్కపటంగానే కనబడ్డాడు, గాని అతడు తెలిసికొనగోర లేదు. అతని కిష్టమైతేనే విధేయత. చూపాలనుకొన్నాడు. విచారం యేమంటే, అనేకులు నేడు అలాగున్నారు. రక్షింపబడాలని తాము తలంచుచున్నట్లు అనుకొనేవారు వేలకొలది యున్నారు గాని నిజానికి వారట్లను కొనడం లేదు.

౩. ఈ ప్రశ్న అపొస్తలుల కార్యములలో మూడుసార్లు రికార్డు చేయబడినది. వింత యేమంటే, మూడు రకాల జవాబులియ్యబడినవి. ప్రతి జవాబు పరిశుద్ధాత్మని అధికారముచొప్పున ఇయ్యబడినది. అంతా చేయబడాలి. మనం ఒక్కొక్కదానిని చదివి రకరకాల జవాబులవలె కనబడుచున్న వాటిలోని సమన్వయతను గమనిద్దాం.

## II పెంతెకొస్తువాటి యూదులు

1. ప్రశ్న జవాబు : అపొ. కా. 2లో అపొస్తలుల మీదికి పరిశుద్ధాత్ముడు వచ్చుటనుగూర్చి మనం చదువుతాం. వారిని సువార్త ప్రకటించుటకు నడిపించి నిర్దేశించుటయే దాని ఉద్దేశము. ప్రతి జనాంగమునుండి వచ్చిన యూదులు అక్కడ నివసించుండిరి. ప్రతివాడు తన భాషలో వినుచుండినప్పుడు ఎక్కువ ఉద్రేకము కలిగెను. కొందరు ఆశ్చర్యపడిరి. మరికొందరు అపొస్తలులు క్రొత్త మద్యముతో నిండియున్నారనిచెప్పి హేళన చేయజూచిరి. ఈ యపవాదము తరువాత పేతురు ప్రసంగం కనబడుచున్నది. దేవుని వాక్యం ప్రకటింపబడగా వారు హృదయములో నొచ్చుకొని "సహోదరులారా, మేమేమి చేతుమని?" అడిగారు (అపొ. కా. 2:37). "పేతురు - మీరు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని జవాబిచ్చాడు (అపొ. కా. 2:38). వారు విశ్వసించాలని ఎందుకు చెప్పబడలేదు? వారు విశ్వసించారు గనుక, రక్షింపబడుటకు వారేమిచేయాలో తెలిసికొనగోరారు. ఈ విశ్వాసులు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలని పేతురు వారికి చెప్పాడు. పేతురు మాటలనుబట్టి మారుమనస్సు ఎంత అవసరమో బాప్తిస్మముకూడ అంతే అవసరం. అవి రెండును పాపక్షమాపణ నిమిత్తం అవసరం. మారుమనస్సు పాపక్షమాపణ నిమిత్తమైతే బాప్తిస్మముకూడా అల్లే.

2. రక్షణ పొందుటకు విశ్వాసము, హృదయ మార్పు కంటె ఎక్కువ అవసరం. యెరూషలేములో ప్రశ్నించిన వీరు విశ్వసించుట మాత్రమే గాక, వారు హృదయమార్పును అనుభవించారు. ఈ సంఘటన ఆరంభములో అపొస్తలులు మద్యముతో నిండియున్నారని వారు నిందించారు. పిమ్మట, సువార్తను విన్న తరువాత, రక్షింప

బడుటకు ఏేమి చేయాలో వారు తెలిసికొనగోరారు. వారు విశ్వ సించారు, హృదయపరివర్తన నొందారు గాని రక్షింపబడలేదు. దీనిని మనం కచ్చితంగా ఎరుగుదుము, ఏలయనగా కొందరు బోధకులు చెప్పుచున్న రీతిగా పేతురు, "రక్షింపబడడానికి మీరు చేయవలసిన దంతా, కేవలం విశ్వసించి మనోపరివర్తన పొందండి" అని చెప్ప లేదు. అట్లుకాదు! మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలని పేతురు వారికి చెప్పాడు. వారు విశ్వసించిరి; హృదయమార్పు ననుభవించిరి; మరియు దీనికి తోడుగా వారు మారు మనస్సు పొంది పాపములు క్షమించబడునట్లు బాప్తిస్మము పొందవలసి యున్నది.

## III తార్సువాడైన సౌలు

1. పౌలుగా మారిన సౌలు ఒక హింసకునివలె పరిచయం చేయ బడ్డాడు. స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపిన సందర్భములో అతడు మొదట పరిచయం చేయబడ్డాడు (అపో. కా. 7:58; 8:1). "ఆసక్తి విషయము సంఘమును హింసించువాడనై" యుంటిని యని తరువాత తననుగూర్చి తాను చెప్పాడు (ఫిలిప్పీ 3:6). క్రైస్తవుల నోళ్లు మూయించడానికి అతడు వారిని ఘోరంగా హింసించాడు (అపో. కా. 26:10, 11). అతడు కఠినుడైన హింసకుడైనను అతని మనస్సాక్షి అనింద్యమైనది. "సహోదరులారా, నేను నేటివరకు కేవలము మంచి మనస్సాక్షిగలవాడనై దేవునియెదుట నడుచుకొంటిని" యని అతడు చెప్పగలిగాడు (అపో. కా. 23:1). అతడు చేయునది సరియైనదని తలంచాడు, అందువలన అతని మనస్సాక్షి అతని బాధించలేదు (అపో. కా. 26:9). ఆత్మీయ విషయాల్లో మానవుని మనస్సాక్షిని మార్గదర్శిగా నెంచుకోరాదనడానికి యిది కచ్చితమైన ఋజువు. తాను రైటేనని మానవుడు తలంచునంత కాలము అతని మనస్సాక్షి

నిర్మలంగా యుంటాది. తాను రైటనుకొనుటవలన సౌలు మంచి మనస్సాక్షి కలిగియుండెను; గాని అతడు తప్పు. మంచివారైన అనేకుల విషయంలో నేడు ఈ సంగతి సత్యం.

2. సౌలుయొక్క ప్రశ్న, ఇయ్యబడిన జవాబు: క్రైస్తవులను హింసించుటకు సౌలు దమస్కుపోవు మార్గమున ప్రయాణించుచుండగా అతని చుట్టు ఒక గొప్ప వెలుగు ప్రకాశించెను, మరియు అతడు యేసు స్వరమును విన్నాడు. కొందరనుకొనుచున్నట్లుగా అతన్ని క్షమించడానికి గాక అతని "పరిచారకునిగాను సాక్షిగాను నియమించుటకై" యేసు అతనికి కనబడెను (అపొ. కా. 26:16). ఈ అద్భుతసంగతి అతని రక్షించలేదు. నేనేమి చేయవలెనని సౌలు అడుగగా యేసు, "లేచి పట్టణములోనికి వెళ్లుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను" (అపొ. కా. 9:6). అతడు చేయవలసినది కొంత యున్నది. సౌలుకు కొదువైనది కొంత యున్నది. అది విశ్వాసముకాదు, ఏలయనగా అతడు విశ్వసించాడు. అది మారుమనస్సుకూడ కాదు. అతడెంత మనః పరివర్తన పొందాడంటే మూడు దినములు అన్న పానములేమియు పుచ్చుకొనక ప్రార్థనలో గడిపాడు (అపొ. కా. 9:9, 11). అతడు చేయవలసినదేమిటో తెలిసికొనేవరకు అతడట్లు గడిపాడు. అది హృదయ మార్పు కూడ కాదు. క్రైస్తవులను హింసించాలనే కోరికనుండి తానే క్రైస్తవుడు కావాలనే కోరికకు అతని హృదయం మారింది. అతనికి కొంత కొదువయున్నది, గాని అది విశ్వాసము, మారుమనస్సు హృదయమార్పు కాదు. సౌలుకంటె వీటి నిర్ధారణను ఎక్కువ చూపినవాడు లేడు. అతడు రక్షింపబడ్డాడా ? లేదు ! అతని పాపములు కడిగివేయబడలేదు. అతడు చేయవలసినదేమిటో అతనికి తెలియజేయబడునని క్రీస్తు చెప్పాడు. అదేమిటి ? అననీయ అతనియొద్దకు వచ్చి, "నీవు తడవుచేయుట ఎందుకు ? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన

చేసి బాప్తిస్మముపొంది నీ పాపములు కడిగివేసుకొనుమని చెప్పెను" (అపో. కా. 22:16). ఆ ప్రశ్నకు ఇయ్యబడిన రెండవ జవాబు యిది. మానవుడు రక్షింపబడాలంటే దేవుడు కోరునదంతా విశ్వాసము, మారుమనస్సు, హృదయమార్పే యని మానవులు తలంచుట తప్పని విశదమగుచున్నది.

## IV చెరసాల అధిపతి

పౌలు సీలాలు ఫిలిప్పయి చెరసాలలో ఖైదీలుగా నుండిరి. అర్ధరాత్రివేళ భూకంపము కలిగింది. "వెంటనే తలుపులన్నియు తెరచుకొనెను, అందరి బంధకములు ఊడెను". చెరసాల నాయకుడు నిద్రనుండి మేలుకొనెను. చెరసాల తలుపులన్నియు తెరచియుండుట చూచి, ఖయిదీలు పారిపోయిరనుకొని కత్తి దూసి తన్నుతాను చంపుకోబోయెను. అయితే పౌలు అతని ఆపుచేసాడు. చెరసాల నాయకుడు "వణకుచు పౌలుకును సీలకును సాగిలపడి, వారిని వెలుపలికి తీసికొనివచ్చి - అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెననెను" (అపో. కా. 16:30). ప్రశ్న నడిగిన యితడు అవిశ్వాసి. అతడు సువార్త వాక్యమును ఎన్నడైనా విన్నట్లు ఎక్కడా ఋజువు లేదు. "అందుకు వారు - ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురని" చెప్పిరి (అపో. కా. 16:31). అయితే ఆ కథ అంతటితో ఆగిపోలేదు. వారు "అతనికిని అతని ఇంటనున్న వారి కందరికిని దేవుని వాక్యము బోధించిరి" (అపో. కా. 16:32). ఎందువలన ? అతడు విశ్వసించునట్లు (రోమా 10:17). ఆ చెరసాల యధిపతి తరువాత మారుమనస్సు పొందాడు (వారి గాయములు కడిగాడు). మరియు "రాత్రి ఆగడియలోనే అతడును అతని యింటివారందరును బాప్తిస్మము పొందిరి" (అపో. కా. 16:33). తన పాపములు కడిగివేయబడునట్లు బాప్తిస్మము పొందాలని పౌలుకు చెప్పబడింది. చెరసాల అధిపతికూడ అదే కారణం

కొరకు బాప్తిస్మము పొందాలని అతడు తప్పక అతనికి చెప్పియుండును. "దేవుడు పక్షపాతి కాడు" (అపొ. కా. 10:34).

## V ఒకే ప్రశ్నకు మూడు జవాబులు

ఒకే ప్రశ్నకు మూడు రకాలైన జవాబులను మనం చదివాం. దాని వివరణ ఏమంత కష్టముకాదు :

1. చెరసాల నాయకుడు ఒక అవిశ్వాసి. అతడు విశ్వసించాలని చెప్పబడింది. అతనిలో విశ్వాసమేర్పడు నిమిత్తం వారతనికి వాక్యమును బోధించారు. తరువాత అతడు మారు మనస్సుపొంది, బాప్తిస్మము పొందాడు.

2. పెంతెకొస్తునాటి ప్రజలు విశ్వసించారు. గనుక పాపక్షమాపణ నిమిత్తం మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందాలని వారికి చెప్పబడింది.

3. సౌలు నమ్ముచు, మారుమనస్సు పొందిన ఒక వ్యక్తి గనుక అతడు బాప్తిస్మము పొంది పాపములను కడిగివేసుకోవాలని చెప్పబడింది.

4. రక్షణపొందే మార్గములో వారు వివిధచోట్ల యున్నందున వారికి వివిధ జవాబులియ్యబడినవి. గాని వారందరు ఒకే సంగతులను చేసారు, ఒకే మార్గములో పయనించారు. ఉదాహరణకు ఒకడు కాకినాడనుండి రాజమండ్రికి ఎంతదూరమని అడుగుతాడు. నలభై మైళ్లని అతనికి చెప్పబడతాది. అతడు ఇరవై మైళ్ళు ప్రయాణించి మరల అడుగుతాడు. ఇరవై మైళ్ళని అతనికి జవాబియ్యబడతాది. అతడు ఇంకొక పది మైళ్లు ముందుకు పోయి మరల అడుగుతాడు. మరల అతనికియ్యబడిన జవాబు వేరుగ యుంటాది : ఇప్పుడు పదిమైళ్ళే యని చెప్పబడతాది, ఒకే ప్రశ్నకు అతనికి మూడు రకాలైన జవాబియ్యబడింది. "రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ?" అనే

ప్రశ్న విషయంలో కూడ యిది సత్యమే, క్షమించబడే మార్గములో అవిశ్వాసి పయనించడానికి ఆరంభించలేదు. అతడు విశ్వసించాలని చెప్ప బడింది. మరియు విశ్వసించిన తరువాత అతడు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందాడు. విశ్వాసులు విశ్వసించాలని గాక మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందాలని చెప్పబడింది. మారుమనస్సు పొందిన విశ్వాసియగు సౌలుకు విశ్వసించి మారుమనస్సు పొందాలని చెప్పబడలేదు. అతడు బాప్తిస్మము పొంది తన పాపములు కడుగు కొనాలని చెప్పబడింది. అందరు ఒకే మార్గమున పయనించారు. అందరు ఒకే రీతిగ మార్పు జెందారు. బైబిలు తనకు తానే విరుద్ధముగా లేదు. ఈ ప్రశ్నకు లేఖనార్థముగా జవాబిచ్చునప్పుడు మానవుడు పరిశుద్ధాత్మ యిచ్చిన మూడు జవాబులను తప్పక ఇయ్యాలి. మాన వుడు సూర్యునిలో చీకటిని, గాలిలో మార్పును ఎట్లు కలుగజేయ లేడో అట్లే దైవిక అధికారమువలన ఈ దైవ చట్టాన్ని మార్పు చేయలేడు.

## దావీదు సింహాసనముపై క్రీస్తు

"దావీదు సింహాసన"మనగా ఏమిటో చాలమందికి సరియైన ఆలోచన లేదు. క్రీస్తువారు రెండవరాకడలో దావీదు సింహాసనము మీద కూర్చొని యెరూషలేములో 1000 సంవత్సరముల పరిపాలన చేయునని తప్పు అభిప్రాయ మున్నది.

దావీదు సింహాసనమునుగూర్చి దావీదునే ప్రశ్నించుదాము. దావీదు ఏమి చెప్పుచున్నాడు? "అయ్యా, సింహాసనము నాదికాదు. రాజ్యముకూడా నాదికాదు. ఆ రెండును యెహోవాయే" (I దిన 28:5, II దిన 13:8).

ఇశ్రాయేలీయులు, తమ్మును ఏలకుండా యెహోవాను విసర్జించి ఒక మనుష్యుని రాజుగా కోరుకొనిరి (1 సమూ 8:5-9). అప్పటినుండి

రాజ్య సింహాసనము, మొదట సౌలుకును, తరువాత దావీదుకును, తరువాత సొలొమోనుకు వచ్చినది (I దిన 29:23, II దిన 9:8). అప్పటినుండి యెరూషలేములో యూదా గోత్రికులు రాజులుగా ఏలియుండిరి. చివరి రాజు సిద్కియా. అతనికి యెహోవా వర్తమాన మేమనగా - "దావీదు సింహాసనముమీద కూర్చుండు యూదా రాజా (యిర్మియా 22:1)...ఇకమీదట ఎవడును యూదాలో రాజుగా వుండడు...ఇక యెవడును దావీదు సింహాసనముమీద కూర్చుండడు (యిర్మియా 22:30)"

"కోపము తెచ్చుకొని నీకు రాజును నియమించితిని, క్రోధము కలిగి అతని కొట్టివేయుచున్నాను" (హోషేయ 13:11)

"తలాటము తీసివేయబడును. కిరీటము ఎత్తబడును...(యూదా రాజ్యమును, సింహాసనమును) పడద్రోయుదును, పడద్రోయుదును, పడద్రోయుదును..."దాని స్వాస్థ్యకర్త వచ్చువరకు ఆగి అతడు వచ్చిన తరువాత అతనికి యిత్తును (యెహెజ్కేలు 21:26-27)

దాని స్వాస్థ్యకర్త ఎవరో - యెషయ 9:6-7 లోను, లూకా 1:31-33 లోను స్పష్టముగా చెప్పబడినది.

అటువంటి స్వాస్థ్యకర్త వచ్చి యిహలోక సంబంధమైన రాజ్యమును పరలోకసంబంధమైన రాజ్యముగా మార్చును - మత్తయి 16:18-19, యోహాను 18:36, కొలస్స 1:13, మత్తయి 22:44, మార్కు 16:19, లూకా 22:69, అ.కా. 2:33, అ.కా. 7:55 రోమా 8:34, 1 పేతురు 3:22. ఇప్పుడు క్రీస్తువారు పరలోకములో ఉండి, రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువుగాను పరిపాలనచేయుచు న్నాడు (1 కొరింధి 15:24-26, 1 తిమోతి 6:15-16).

5. నిత్యుడగు తండ్రి ! దేవుడు మనకు పరలోక తండ్రియై యుండగా, క్రీస్తువారు సంఘమునకు శిరస్సుగా చేయబడి, దేవుని కుటుంబమైన దేవుని రాజ్యములో ఉన్నత పదవిని అలంకరించు చున్నాడు (యోహాను 14:8-9, ఎఫెసి 1:20-23, ఫిలిప్పి 2:9-11).

దావీదు సింహాసనాసీనుడై (అ.కా. 2:29-37) జాగ్రత్తగా పరిశీలించినచో, సంఘ ప్రారంభ దినమునాటికి, క్రీస్తు దావీదు సింహాసనాసీనుడై యున్నట్లు చూడగలము. ఆ విధముగా - యెషయ 55:3 లో వాగ్దానముచేసిన - "దావీదుకు అనుగ్రహించిన పవిత్ర వరమును అనుగ్రహింతును" అనుదానిని క్రీస్తు పొందెనని, అ.కా. 13:32-35 లో చూడగలము. ఇప్పుడు క్రీస్తువారు ఆ సింహాసనముపై యున్నాడు. పునరుత్థాన దినము వరకును, న్యాయతీర్పు వరకు ఆ సింహాసనాసీనుడై యుండవలెనని 1 కొరి 15:24 లో తెలుపబడినది. సింహాసనాసీనుడై యాజకత్వము చేయునని జెకర్యా 6:12 చెప్పబడినది. ఎందుకనగా ఆయన భూమిపై యున్నయెడల యాజకుడై యుండడని - హెబ్రీ 8:4 లో చూచుచున్నాము. కనుక క్రీస్తువారికి భూలోకములో వుండి రాజ్యపాలన చేయుటకుకూడా వీలులేదు (యిర్మియా 22:30). ప్రస్తుతము, క్రైస్తవులందరు, క్రీస్తు రాజుగా నున్న రాజ్యములో వున్నారు (కొలస్స 1:13, హెబ్రి 12:28, 1 కొరింధి 15:25).

— T. విక్టర్ దానియేలు, తెనాలి.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA–533 001

No.

To.

.....................................

.....................................

.....................................

.....................................